ప్రజాశక్తి

సోమవారం 19 ఫిబ్రవరి 2024 5 అనంతపురం



విద్యార్థి, యువజన సంఘాల నాయకుల ముందస్తు అరెస్టు

రాయదుర్గం : రాప్తాడులో సిఎం జగన్ సిద్ధం సభను అడ్డుకుంటారనే ఉద్దేశంతో రాయదుర్గం పోలీసులు విద్యార్థి, యువజన సంఘాల నేతలను ముందస్తు అరెస్టు చేశారు. అందులో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొత్రేష్‌లకు పోలీసులు ముందస్తు నోటీసు ఇచ్చి రాప్తాడుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అరెస్టయిన సంఘాల నాయకులు మాట్లాడుతూ 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని, పరీక్ష ఫీజులు తగ్గించాలని, అప్రెంటిస్ విధానాన్ని ఎత్తేయాలని, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.35 లక్షల పోస్టులను భర్తీ చేయాలని, ఇతర విద్యా సంబంధమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఎం జగన్ జిల్లా పర్యటనను అడ్డుకుంటామని భారత విద్యార్థి సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు ముందుగానే బహిరంగ ప్రకటన చేయడంతో పోలీసులు ముందు జాగ్రత్తగా నాయకులను అరెస్టు చేశారు. సమస్యలను పరిష్కరించకుండా అరెస్టులతో నాయకులను అడ్డుకోవడం తగదని వారు సూచించారు.

హామీల్లేవ్.. సమస్యల ప్రస్తావనా లేదు..!



రాప్తాడలో నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో పాల్గొన్న వైసిపి శ్రేణులు



రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చిన వైసిపి శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి

- ◆ ఆత్మస్తుతి..పరనిందతోనే సరి
- ◆ సాదాసీదా ప్రసంగంతో ముఖ్యమంత్రి సిద్ధం సభ
- ◆ రాయలసీమ జిల్లాల నుంచి భారీగా జనసమీకరణ
- ◆ ఆర్టీసీ బస్సులన్నీ సభకు వెళ్లడంతో ప్రయాణికులకు ఇక్కట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల సమయంలో రాజకీయ సభను అధికార వైసిపి పెట్టడంతో రాయలసీమ సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి స్పందిస్తారని అందరూ ఆశించారు. సమస్యల ప్రస్తావనగానీ, వాటి పరిష్కారానికి హామీలుగానీ ఏవీ లేకుండానే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రసంగం సాగింది తాము అధికారంలోకి వచ్చాక అన్నీ చేసామని ప్రకటించుకోవడంపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. అదే సమయంలో టిడిపి అధికారంలో ఉండగా ఏమీ చేయలేదన్నది ప్రజలకు వివరించడానికి సమయం వెచ్చించారు. ఈ సభకు రాయలసీమ జిల్లాల నుంచి భారీగా జనసమీకరణను వైసిపి చేపట్టింది. దీంతో ఈ ప్రాంత సమస్యలపై కొంత వరకైనా స్పందిస్తారని ఆశించారు. కాని ఈ ప్రాంత సమస్యల ప్రస్తావన జోలికే వెళ్లలేదు.

99 శాతం హామీలు అమలు చేసాం
ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి

ఎన్నికల మ్యానిఫెస్టోలోని ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేస్తాని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సిద్ధం సభలో పునరుద్ఘాటించారు. పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. వారికి మేలు చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అధికారంలో ఉండగా ఏనాడూ ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని టిడిపి ఇప్పుడు రంగురంగుల మ్యానిఫెస్టోతో ప్రజల ముందుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. దీనికి మరికొంత మంది పెత్తందారులు తోడవుతున్నారని చెప్పారు. ఏదోరకంగా విజయం సాధించాలని ప్రయత్నాలను టిడిపి చేస్తోందన్నారు. దీనికి ధీటుగా వైసిపి నాయకులు, కార్యకర్తలు సంసిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన వారినే స్టార్ క్యాంపెయినర్లుగా మార్చాల్సిన అవసరముందని సూచించారు. పెత్తందారులకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధమిది అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి 175 అసెంబ్లీ స్థానాల్లోనూ, 25 పార్లమెంటు స్థానాల్లో గెలిపించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే కాలంలోనూ సంక్షేమ అమలు జరగాలంటే వైసిపి రావాల్సిందేనని చెప్పారు. టిడిపి వస్తే అవి ఉండబోవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వాహనాలన్నీ సిద్ధం సభకు...జనంకు ఇక్కట్లు..!

సిద్ధం సభ కోసం భారీ జనసమీకరణను వైసిపి చేపట్టింది. ఇందుకు అవసరమైన అధికార బలాన్ని అంతటినీ ఉపయోగించింది. సుమారు ఆరు వేల వాహనాలను వినియోగించింది. ఇందులో ఆర్టీసీ బస్సులే అధికంగానున్నాయి. ఒక్క అనంతపురం జిల్లాకే 1520 బయటి బస్సులతోపాటు 520 ఉమ్మడి జిల్లా బస్సులు కేటాయించింది. ఇన్ని ఆర్టీసీ బస్సులను సిద్ధం సభకు జనం తరలించేందుకు కేటాయించడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో జాతీయ రహదారి 44 ఆనుకుని సభను ఏర్పాటు చేయడంతో సభకు వచ్చే వాహనాలతో ట్రాఫిక్ జామ్ అయి గంటల తరబడి అటు బెంగళూరు, ఇటు హైదరాబాద్ వైపు వెళ్లే సాధారణ ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

కల్తీ నివారణకు చర్యలు

అనారోగ్యానికి కల్తీ ఆహార పదార్థాలే కారణం
కల్తీ ఆహార నియంత్రణ జిల్లా అధికారి రామచంద్ర



రామచంద్ర

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రజారోగ్యం దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా కల్తీ ఆహార పదార్థాల నివారణకు ఎప్పటికప్పుడు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కల్తీ ఆహార నియంత్రణ అధికారి రామచంద్ర తెలిపారు. కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల ప్రజలు అనేక రోగా లు కొని తెచ్చుకుంటున్నారని, కావున కల్తీ ఆహార పదార్థాల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలి. సమాజం వేగంగా అభివృద్ధి చెందు తుండడంతో అంతే వేగంగా కల్తీ ఆహార పదార్థాలు ఎక్కడపడితే అక్కడ విక్రయిస్తున్నారు. వాటిని తినటం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, కిరాణా షాపుల్లో కల్తీ యథేచ్ఛగా జరుగుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండకపోతే ఆస్మా, క్యాన్సర్, తదితర రోగాలకు గురి కావాల్సి వస్తుంది. నేడు ఏ వస్తువు చూసినా కల్తీమయం అవుతోంది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా కల్తీ అనేది సర్వసాధారణమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కల్తీ ఆహార నియంత్రణ అధికారి రామచంద్ర ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలిపారు.

ప్ర : కల్తీ ఆహారంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారా?

జవాబు : పాఠశాలలు, అవకాశం ఉన్న ప్రతిచోట కల్తీ ఆమారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతు న్నాం. కొత్త జిల్లా ఏర్పడినందున తగినంత సిబ్బంది లేరు. వాహన సౌకర్యం కూడా లేదు. దీంతో ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

ప్రశ్న : ఆహార కల్తీని ఎలా నిర్ధారిస్తారు?
తీసుకునే చర్యలు ఏమిటి?

జ : కల్తీ ఆహారాన్ని నియంత్రించ డానికి భారత ప్రభుత్వం 2016లో చట్టం తెచ్చింది. దీని ప్రకారం ఏడాదికి రూ. 12 లక్షల వరకు టర్నోవర్ ఉన్న వ్యాపారులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలి.



లైసెన్స్ లేని వారికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 6 లక్షల వరకు జరిమానా ఉంటుంది. హోటళ్లు, కిరాణా షాపుల్లో కాలం చెల్లిన వస్తువులు అమ్మితే నేరం. కల్తీ ఆహార పదార్థాలను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు శాంపిల్ పంపుతాం. అక్కడి నుంచి 20 రోజులకు నివేదికలు వస్తాయి. వాటి ఆధారంగా కోర్టులో చట్టపరంగా శిక్షలు వేస్తారు. రిజిస్ట్రేషన్, లైసెన్సు ప్రక్రియ అన్నీ ఆన్‌లైన్ లో జరుగుతాయి.

ప్ర : కల్తీని ఏ ప్రాతిపదికన నిర్ధారిస్తారు ?

జ : కాలం చెల్లిన వస్తువులు విక్రయించడం చట్టరీత్యా నేరం. హోటళ్లలో వాడిన నూనెను తిరిగి రెండు మూడు రోజులు వాడుతుంటారు. దాని వల్ల క్యాన్సర్, ఆస్మా లాంటి రోగాలు వస్తాయి. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వాడిన నూనెను మళ్లీ మళ్లీ వాడుతూ ఉంటారు. ప్రస్తుతానికి అవి తినేటప్పుడు రుచికరంగా ఉన్నా వాటి వల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయి. కిరాణా షాపుల్లో గడువు ముగిసిన వస్తువులను విక్రయిస్తుంటారు. వాటిని వినియోగదారులు తీసుకోరాదు.

ప్ర : ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి ?

జ : వస్తువులను కొనే ముందు ఎప్పుడు తయారు చేశారు. వస్తువుకు నిర్దేశించిన గడువు గమనించి కొనుగోలు చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో గడువు పూర్తయిన వస్తువులను కొనరాదు. తాత్కాలికంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పదార్థాలు రుచిగా ఉన్నా, ఆయిల్ ఫుడ్ తినడం వల్ల రోగాలను మనమే కొని తెచ్చుకున్న వారమవుతాము. తాజాగా వేడి వేడి పదార్థాలనే భుజించాలి. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గం : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాప్తాడు వద్ద జరిగిన వైసిపి సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ క్రిష్ణపై దాడి అత్యంత దుర్మార్గమని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గాయపడి అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫొటోగ్రాఫర్‌ను ఆయన ఆదివారం సాయంత్రం పరామర్శించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ వత్తి నిర్వహణలో భాగంగా అక్కడికి వెళ్లిన ఫొటోగ్రాఫర్ కృష్ణపై జరిగిన దాడి పత్రికా స్వేచ్ఛపై దాడి అన్నారు. పత్రిక యాజమాన్యం సూచనల మేరకు పని చేసే విలేకరులపై దాడి చేయడం పిరికిపంద చర్య అన్నారు. ఈ దాడి పై వైసిపి నాయకులు స్పందించాలన్నారు. వెంటనే నిందితులను పోలీసులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న వారు తమకు నచ్చని పత్రికల్లో పనిచేసే సిబ్బందిపై భౌతికదాడులకు తెగబడడం ఏం ప్రజాస్వామ్యమన్నారు. పత్రికలో వచ్చిన వార్తలు, ఫొటోలు మీద అభ్యంతరాలు ఉంటే చట్టప్రకారం ఎదుర్కోవాలే తప్పా ఇలా దాడులకు దిగడం ప్రజలు సహించరన్న విషయాన్ని వైసిపి నాయకులు గుర్తించాలన్నారు. తీవ్రంగా గాయపడిన ఫొటోగ్రాఫర్ క్రిష్ణకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని రాంభూపాల్ కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, నాయకులు వలి తదితరులున్నారు.

ఫొటో గ్రాఫర్ కృష్ణపై దాడిని పలు పార్టీలు ప్రజాసంఘాల నాయకులు ఖండించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ తదితరులు ఖండించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

20న కలెక్టరేట్ ఎదుట ధర్నా

జిల్లా ఉద్యోగ జెఎసి అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు పెన్షనర్‌లకు రావాల్సిన డిఏ బకాయిలు, పిఆర్‌సి అమలు, ఇతర అరియర్స్ చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని ఉద్యోగ జెఎసి జిల్లా ఛైర్మన్ బి.చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ డి.చంద్రమోహన్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్యలు పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్జీఓ హోంలో ఉద్యోగ జెఎసి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. హక్కుల సాధన కోసం ఐక్యమత్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని నేతలు పిలుపునిచ్చారు. 20న జరిగే కలెక్టరేట్ ఎదుట ధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్‌లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి పౌరుడు రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉన్నప్పుడు మాత్రమే ఉత్తమ సమాజ నిర్మాణం ఏర్పడే ఆస్కారం ఉందని జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి కె.అల్తాఫ్ అధ్యక్షతన ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ద్వితీయ మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక పని చేస్తోందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పుట్టిన ప్రతి జీవి సమాజానికి రుణపడి ఉంటుందన్నారు. ప్రకృతి, పర్యావరణం మనం ఏది అడక్కుండానే తన రుణం తీర్చుకుంటుందన్నారు. కానీ మానవుడు స్వార్థజీవిగా మారి మానవ శ్రేయస్సుకు దోహదం చేస్తున్నాడన్నారు. తన స్వార్థం కోసం ప్రకృతిని, పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాడన్నారు. కావున ప్రతి పౌరుడూ సామాజిక బాధ్యత గుర్తించి, హక్కులను అమలు చేసుకున్నప్పుడు మాత్రమే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. అనంతరం జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కె.అల్తాఫ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.సాంబశివుడు, కోశాధికారిగా టి.వి.రెడ్డి.తో పాటు 16మంది జిల్లా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్ కమిటీ నాయకులు డాక్టర్ శంకర్‌గౌడ్, జైభారత్ సంస్థ నాయకులు కుళ్లాయప్ప, మానవతా రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమర్నాథ్‌రెడ్డి, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య, నగర గౌరవాధ్యక్షులు కంబదూరు షేక్ నబిరసూల్, వివిధ మండలాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.సుబ్బయ్య, బి.శ్రీనివాసరెడ్డి, సంగా.ఫణిభూషణ్, ప్రజ్ఞ, సురేష్, డాక్టర్ ఎంఎన్.బృంద, ఎం.శ్రీనివాసులు, ఉమా మహేశ్వరి, పి.వి.ప్రసాద్‌రెడ్డి, టిఎన్.రసూల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఆనుకుని విద్యుత్ స్తంభాలు

భయాందోళనలో వాహనదారులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో ప్రతి గ్రామానికీ త్రీ ఫేస్ కరెంటు ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆర్డీఎస్ స్కీం కింద విద్యుత్ లైన్లను లాగుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రోడ్డు నుంచి నాలుగు మీటర్ల దూరంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే రోడ్డుకు ఆనుకుని పాతుతుండటంతో స్థానికలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు ఆనుకుని విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తుండటంతో ఉపాధి హామీ పథకం కింద అవన్నీ ప్లాంటేషన్ ద్వారా రోడ్డుకు ఇరువైపుల నాటిన చెట్లు సైతం నేలకు ఒరుగుతున్నాయి. గతంలో వివిధ ప్రాంతాల్లో కరెంటు వైర్లు తెగి మృతిచెందిన సంఘటనలు అనేకంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు ఆనుకుని నాటిన స్తంభాలను తొలగించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్డుకు నాలుగు మీటర్ల దూరంలో ఏర్పాటు చేసి ప్రజలు, వాహనదారులు కోరుకుంటున్నారు.




రోడ్డు పక్కలోనే ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

శిథిలావస్థలో పోలీస్‌క్వార్టర్స్

పట్టణ సమీపంలో నివాసం -పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-నార్పల

శింగనమల నియోజకవర్గంలోనే అతిపెద్ద మండలం నార్పలలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో చాలామంది పోలీసులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చాలా ఏళ్ల క్రితం క్వార్టర్స్ నిర్మించడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఎవరూ నివాసం ఉండకపోవడంతో నిరుపయోగంగా ఉండి రాత్రి సమయంలో ఆకతాయిలకు అడ్డాగా మారాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో పోలీసు సిబ్బంది అనంతపురం, తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటూ వచ్చి వెళ్తున్నారు. ఫలితంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎందుకంటే ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాల్సి ఉంటుంది. రాత్రి సమయంలో గ్రామాల్లో ఏవైనా గొడవలు జరిగితే స్థానికులు పోలీసులకు అందజేసి వారు అక్కడి నుంచి వచ్చే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతుందని పలువురు అంటున్నారు. కావున ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నార్పలలో శిథిలమైన పోలీస్ క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



నార్పలలో చీకటిలో మగ్గుతున్న పోలీస్ క్వార్టర్స్

ఆశావర్కర్‌కు మెరుగైన వైద్యం అందించాలి



ఆశావర్కర్‌ను పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : రాప్తాడులో సిఎం నిర్వహించిన 'సిద్ధం' సభలో గాయపడిన ఆశావర్కర్‌కు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈమేరకు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆశావర్కర్‌ను సిఐటియు నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్ధం సభలో గాయపడిన ఆశావర్కర్ శివమ్మకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు ఆరోగ్యం కుదుటపడేంత వరకూ సెలవులు ఇవ్వాలని కోరారు. కాగా రాజకీయ సభలకు ఆరోగ్య సిబ్బందిని కేటాయించడం సరైంది కాదన్నారు. ఎవరి అనుమతితో బుక్కరాయసముద్రం నుంచి ఆశా వర్కర్లను సభకు పంపించారో మెడికల్ ఆఫీసర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈమెతోపాటు మెడికల్ విభాగానికి చెందిన దాదాపు 8మంది గాయపడ్డారన్నారు. వారందరికీ ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



పుట్టపర్తి విమానాశ్రయం ముందు భవనంపై నుంచి ఫ్లెక్సీలు ప్రదర్శించి నిరసన తెలుపుతున్న మడకశిర ప్రాంత రైతులు

ముఖ్యమంత్రికి రైతుల నిరసన సెగ

- ◆ పుట్టపర్తి విమానాశ్రయం వద్ద ఫ్లెక్సీలు చూపి ఆందోళన
- ◆ అడ్డుకున్న పోలీసులు.. రైతులు అరెస్టు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి రైతుల నుంచి నిరసన సెగ తగిలింది. ఆదివారం మధ్యాహ్నం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న సిఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసేందుకు మడకశిర ప్రాంతానికి చెందిన రైతులు పోలీసులు అనుమతి కోరారు. సమస్యలపై వినతిపత్రం అందించేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా అందుకు పోలీసులు అంగీకరించలేదు. దీంతో రైతులు పుట్టపర్తి విమానాశ్రయం ముందు ఓ భవనంపైకి ఎక్కి పోస్టర్లు ప్రదర్శించి నిరసన తెలిపారు. భవనంపైన నిరసన తెలుపుతున్న వారిని సైతం పోలీసులు వదలకుండా బలవంతంగా వారిని అక్కడి నుంచి కిందకు దింపేశారు. ఈ సమయంలో రైతులు రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. వారిని బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించి బుక్కపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసేంత వరకు వారిని అక్కడే ఉంచి అనంతరం విడుదల చేశారు. రైతు సమస్యలను ముఖ్యమంత్రికి చెబుదామని వస్తే ఇలా అడ్డుకోవడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఇలా అడ్డగింపులను ఆపి రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. సాగునీరు లేక మడకశిర ప్రాంతంలో రైతులు జీవనం దుర్భరంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పంటల సాగు నిమిత్తం మడకశిర బ్రాంచి కెనాల్‌కు నీరివ్వాలన్నారు. పట్టుగూళ్ల విక్రయాల్లో రైతులకు ఇస్తున్న కిలోకి 50 రూపాయలు ప్రోత్సాహం రూ.4 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణం విడుదల చేయాలని కోరారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి స్పందించాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆదమరిస్తే మృత్యువాతే..

పుట్లూరులో ప్రమాదకరంగా బ్రిడ్జి - భయాందోళనలో విద్యార్థులు, ప్రజలు

ప్రజాశక్తి-పుట్లూరు

ఈ బ్రిడ్జిపై వెళ్లేటప్పుడు ఏమాత్రం ఆదమరిచినా మృత్యువాత పడాల్సిందే. మండల కేంద్రంలోని హెచ్ఎల్‌సి కాలువపై ఏర్పాటు చేసిన రెండు బ్రిడ్జిలకు ఇరువైపులా ఉన్న సైడ్‌వాల్స్ కూలిపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో బ్రిడ్జిపై ప్రయాణించాలంటే వాహనచోదకులు, విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. గతంలో నాయకునిపల్లె వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన బ్రిడ్జిపై వెళ్తూ ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కాలువలో పడి మృతిచెందారు. మరోవైపు బ్రిడ్జిపై కస్తూరిబా బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆదర్శ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ బ్రిడ్జికి సైతం సైడ్ వాల్స్ లేకపోవడంతో గతంలో కాలువలోకి ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు పడిన ఘటనలూ ఉన్నాయి. దీంతో ఆస్తి నష్టం కూడా జరిగింది. అయితే ప్రాణ నష్టం జరగలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రాణనష్టం జరగకముందే మేల్కొని బ్రిడ్జికి ఇరువైపులా సైడ్‌వాల్స్ కట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.



పుట్లూరులో ప్రమాదకరంగా బ్రిడ్జి

'సిద్ధం'కు తరలిన వైసిపి శ్రేణులు

నార్పల : జిల్లాలోని సిఎం జగన్ ఆధ్వర్యంలో రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. శింగనమల నియోజకవర్గ సమన్వయకర్తను ప్రకటించడంతో నియోజకవర్గవ్యాప్తంగా అసంతృప్తి నేతలు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి సంబంధం లేకుండా వందలాది వాహనాల్లో వైసిపి కార్యకర్తలు, నాయకులు సిద్ధం సభకు తరలివెళ్లారు. అలాగే వైసిపి నాయకులు లోకనాథ్‌రెడ్డి, సంజీవరెడ్డి, భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి కార్యకర్తలు సిద్ధం సభకు తరలివెళ్లారు. వీరితోపాటు నార్పల రైతు సేవా సహకార సంఘం అధ్యక్షులు లోకనాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు మొరసు సంజీవరెడ్డి, గూడమరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆధ్వర్యంలో కూడా తరలివెళ్లారు.



పామిడిలో సిద్ధం సభకు తరలుతున్న వైసిపి నాయకులు

ఆత్మకూరు : ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు సిఎం జగన్ సిద్ధం సభకు మండలం నుంచి వైసిపి యూత్ కన్వీనర్ కొండారెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు వందలాది వాహనాల్లో వెళ్లారు.

పామిడి : ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ఆదేశాలతో సిఎం జగన్ ఆధ్వర్యంలో రాప్తాడులో నిర్వహిస్తున్న సిద్ధం సభకు మండలం నుంచి గుత్తి మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో వందలాది వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఉదయం నుంచి పామిడిలో వైసిపి కార్యకర్తలతో సందడి వాతావరణం నెలకొంది.

పుట్లూరు : జిల్లాలోని రాప్తాడులో నిర్వహిస్తున్న సిద్ధం సభకు వైసిపి నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ సునీత, ఎంపిపి రాఘవరెడ్డి, భూమిరెడ్డి గారి నాగార్జునరెడ్డి, కోమటికుంట్ల సర్పంచి జెసి రామాంజనేయులు ఉన్నారు.

రాయదుర్గం : రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిఎం జగన్ 'సిద్ధం' బహిరంగ సభకు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు బస్సులు, ఇతర వాహనాల్లో పెద్దఎత్తున తరలివెళ్లారు. రాయదుర్గం పట్టణంతో పాటు మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలి వెళ్లారు. వాహనాల్లో తాగునీరు, భోజనం కూడా తీసుకెళ్లారు.

వికలాంగుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు


మండల కేంద్రానికి చెందిన వికలాంగుడు గొల్ల అక్కులన్నపై దాడి చేసిన వారిని శిక్షించాలని ఆదివారం వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం మండల కార్యదర్శి గంగన్న మాట్లాడుతూ గొర్రెలు మేపుకుంటూ జీవిస్తున్న వికలాంగుడు అక్కులన్నను ఇంటి పక్కన ఉన్నవాళ్లు దాడి చేయడం బాధాకరమన్నారు. అంతేకాకుండా అక్కులన్న భార్యను అవమానిస్తూ దుర్భాషలాడటం దురదృష్టకరమన్నారు. దాడి చేయడంతో అక్కులన్న అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. వెంటనే వికలాంగుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



గాయాలపాలైన అక్కులన్న

పలువురు టిడిపిలో చేరిక

పామిడి : మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ సమక్షంలో నియోజకవర్గ కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పామిడి మండలం కత్రిమల గ్రామానికి చెందిన 20 కుటుంబాలు ఆదివారం టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా జితేంద్రగౌడ్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గుర్రం నారాయణస్వామి, ప్రభాకర్‌చౌదరి, పామిడి టౌన్ కన్వీనర్ రామకృష్ణ, బొమ్మమోహన్, వడ్డే శివ, మాధవ, సూరి, బెస్త గేరు శివ, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలోకి చేరిన వారికి కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

ఐకమత్యంతో ముందుకు సాగుదాం

జనసేన నగర ఉపాధ్యక్షులు సదానంద

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అన్నివర్గాలను కలుపుకుని ఐకమత్యంతో పోరాడి సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కులు సాధించుకుందామని విశ్రాంత రిజిస్ట్రార్, జనసేన నగర ఉపాధ్యక్షులు సదానంద పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో కాపు సంక్షేమ సేన ఎస్సీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో ఎస్సీలంతా ఏకతాటిపైకి వచ్చి టిడిపి, జనసేన అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దంపెట్ల శివ, ఎస్సీ, ఎస్టీ ప్రజా సమైక్య అధ్యక్షులు మద్దెల చెరువు మల్లి, శరత్‌బాబు, మహాజన సంక్షేమ సంఘం నాయకులు సిద్ధార్థ బాబు, ఆకులేటి ఓబులేసు, కాపు సంక్షేమ సేన రాష్ట్ర నాయకులు పేరూరు శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ గంధి దివాకర్, గౌరవ సలహాదారులు అంబారపు క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

ఫొటోగ్రాఫర్‌పై వైసిపి మూకల దాడి అమానుషం

నార్పల : రాప్తాడులో నిర్వహించిన సిఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం బాధాకరమని మండలంలోని పాత్రికేయులు ఆదివారం ఒక ప్రటకనలో ఖండించారు. సభకు సంబంధించిన ఫొటోలను తీసుకున్న ఆంధ్రజ్యోతి దినపత్రిక ఫొటోగ్రాఫర్ కృష్ణపై కొంతమంది వైసిపి అల్లరి మూకలు దాడి చేయడం బాధాకరమన్నారు. దాడికి కారణమైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

శింగనమల : రాప్తాడులో నిర్వహించిన సిఎం జగన్ సిద్ధం సభలో ఫొటోలు తీసుకున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసిపి అల్లరి మూకలు దాడి చేయడం బాధాకరమని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. పోలీసుల సమక్షంలోనే దాడి జరగడం చూస్తుంటే రాష్ట్రంలోని పోలీసు వ్యవస్థ ఎవరికోసం పని చేస్తుందో అర్థం అవుతుందన్నారు. వెంటనే దాడి చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఫ్యాన్‌ను పక్కన పెట్టేందుకు ప్రజలు 'సిద్ధం'

జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

అనంతపురం కలెక్టరేట్ : 'గాజు గ్లాస్‌ను ఎక్కడ పెట్టాలో.. తుప్పు పట్టిన ఫ్యాన్'ను ఎక్కడ ఉంచాలో రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. రాప్తాడు సిద్ధం సభా వేదికగా సిఎం జగన్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమనానరు. 99 శాతం హామీలు అమలు చేశానని చెప్పుకుంటున్న సిఎం గుండెల మీద చెయ్యి వేసుకుని మద్యపానం నిషేధం చేసిన తర్వాతే ఓటు అడుగుతానని చెప్పిన విషయాన్ని ఎందుకు గుర్తు చేసుకోలేదో నిలదీశారు. అలాగే సిపిఎస్ రద్దు పై ఉద్యోగ, ఉపాధ్యాయులకు సమాధానం ఎందుకు చెప్పలేదన్నారు. కేవలం తప్పుడు వ్యాఖ్యలు, అబద్ధపు మాటలకే సిద్ధం సభ పరిమితమైందన్నారు. పవన్‌కళ్యాణ్‌పై మరోసారి వ్యక్తిగత విమర్శలు చేస్తే సిఎం జగన్ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. అలాగే ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై సిద్ధం సభలో దాడి చేయడం బాధాకరమన్నారు.

కేజీబీవీ తనిఖీ

తనకల్లు : మండల కేంద్రంలోని కెజిబివిని జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు, జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంస్థ చైర్మన్ చెరుకూరి గంగులయ్య ఆదివారం తనిఖీ చేశారు. పాఠశాలలో 400 మంది పిల్లలకు గాను 183 మంది, 17 మంది ఇంటర్మీడియట్ పిల్లలు హాజరుగా ఉన్నారు. ఈ సందర్భంగా గంగులయ్య పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా వర్కింగ్ చైర్మన్ కోటకొండ కిష్టప్ప, కదిరి డివిజన్ చైర్మన్ గోగినేని మునీంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

తెలుగు ప్రొఫెషనల్ వింగ్ పుట్టపర్తి అసెంబ్లీ కమిటీ నియామకం

పుట్టపర్తి రూరల్ : టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు తెలుగు ప్రొఫెషనల్ వింగ్ పుట్టపర్తి అసెంబ్లీ కమిటీని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా జూటూరు అశోక్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా గనిపినేని బాలకృష్ణ, అవుల నాగార్జునను నియమిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలు గుర్తించి తెలుగు ప్రొఫెషనల్ వింగ్ పుట్టపర్తి అసెంబ్లీ కమిటీలో స్థానం కల్పించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన పల్లె రఘునాథ్ రెడ్డి కి, తెలుగు ప్రొఫెషనల్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ తేజస్వి పొడపాటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు ప్రధాన కార్యదర్శి శివరాజ్ కుమార్, వేమూరి మనోజ్ కుమార్, సురేంద్ర నాయుడు, లింగప్పగారి పల్లి రవిరాజు, మిట్టపల్లి హరి, రెడ్డిపల్లి గణేష్, దున్నికోట మధునాయుడు, గూనిపల్లి దివాకర్, అప్పన్నగారి విజయ్ పాల్గొన్నారు.

'జూపూడి' వ్యాఖ్యలు అభ్యంతరకరం

కదిరి టౌన్ : అంబేద్కర్ విదేశీ విద్య పథకం పేరు మార్పుచేసి జగన్ విదేశీ విద్యగా మార్పు చేసిన అభ్యంతరం లేదని జూపూడి ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరం అని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్ బాబు అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని కందికుంట నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతపై ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారుడు జూపూడి ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి కేవలం తన పేరు కోసమే అంబేద్కర్ పేరును తొలగించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, రామాంజి, చిన్నప్ప, గంగాధర్, నరసింహ, కిష్టప్ప, హరి తదితరులు పాల్గొన్నారు.


తోటి కార్మికుడికి సాయం

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం తూమకుంట పారిశ్రామిక వాడలోని రోల్ వెల్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు శివరాజన్ అనారోగ్యంతో భాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు రూ.20వేలు సేకరించుకుని కార్మికుడు శివరాజన్‌కు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రోల్‌వెల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు రవికుమార్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, హరీష్ రెడ్డి, నాయకులు చిన్నప్పయ్య, అబ్రార్, శ్రీరాములు, మహబూబ్‌బాషా, బాలకృష్ణ, హనుమంత రాయుడు, విఎల్ నాగరాజు, అతావుల్లా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

18న ధ్వజరోహణంతో ఉత్సవాలు ప్రారంభం
24న స్వామివారి రథోత్సవం
భారీగా తరలిరానున్న భక్తులు





బొలికొండ రంగనాథస్వామి ఆలయం, (ఇన్‌సెట్‌లో) ఉత్సవ విగ్రహాలు, రథం

ప్రజాశక్తి-గుత్తి

భక్తుల కొంగు బంగారంగా వెలిసిన మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథ స్వామి ఉత్సవాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా భక్తులకు తాగునీరు, నీడ, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా రథోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 18న ధ్వజరోహణతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. 19న సింహ వాహనం, 20న శేష వాహనం, 21న హనుమద్ వాహనం, 22న గరుడ వాహనం, 23న గజవాహనం, కళ్యాణోత్సవం, 24న రథోత్సవం, 25నన పారువేట, అశ్వవాహన, 26న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవంలో రథోత్సవం చాలా కీలకమైన ఉత్సవం.రథోత్సవానికి భక్తులు భారీగా తరలివస్తారు. కాగా బొలికొండ రంగనాథ స్వామి పుట్టు శిల తొండపాడు గ్రామ సమీపంలో ఎతైన కొండపై ఉంది. దీన్ని శ్వేతగిరిగా పిలుస్తారు. ఆలయానికి ఏడాదికి రూ.10 లక్షలకుపైగానే ఆదాయం సమకూరుతోంది. ప్రతి ఏటా మాఘమాసంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో 9 రోజులపాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఉత్సవాల కోసం ప్రత్యేకంగా రథాన్ని తయారు చేయించారు. దీంతోపాటు కళ్యాణ కట్ట, స్థానపు గదులను నిర్మించారు. నూతనంగా చిన్న రథం కూడా తయారు చేయించి షెడ్డును ఏర్పాటు చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, సహాయ కమిషనర్, ఇన్స్‌పెక్టర్, కార్యనిర్వాహణాధికారి వి.దేవదాసు పర్యవేక్షణలో భక్తులకు సౌకర్యాలు, వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భారీగా తరలివస్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

9 రోజులపాటు జరిగే రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇందులో భాగంగా ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇతర వాహనాలు వెళ్లేందుకు ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేశాం. ఉత్సవాలకు ఎంపీ తలారి రంగయ్య, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరుకానున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి వి.దేవదాసు తెలిపారు.

- వి.దేవదాసు, కార్యనిర్వాహణాధికారి, బొలికొండ రంగనాథస్వామి దేవస్థానం

అభివృద్ధి కోసం టిడిపిని ఆదరించండి

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో టిడిపి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలోని రెండవ డివిజన్‌లో టిడిపి ఆధ్వర్యంలో మూడవ రోజు ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా గుత్తి రోడ్డులో ప్రజలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఎక్కడికెళ్లినా ప్రజలు ఇంటి పట్టా కావాలి, ఇల్లు కావాలి, ఇంటి బిల్లు ఇంకా రాలేదని వాపోతున్నారని తెలిపారు. వీటితోపాటు మురికి నీటి సమస్య, అధిక ధరలతో సతమతమవుతున్నారన్నారు. రెండు నెలలు ఆగితే రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామన్నారు. 20 రోజులుగా ప్రజలు నీటి సమస్యతో సతమతమవుతుంటే పట్టించుకునే తీరిక పాలకులకు లేకుండా పోయిందని విమర్శించారు. ఈ సమస్యలు దూరం కావాలంటే వచ్చే ఎన్నికల్లో టిడిపి జనసేన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ రాజీవ్‌రెడ్డి, సాలార్‌బాషా, సాకే గంపన్న, తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళీ, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, జేయం బాషా, పరమేశ్, నారాయణస్వామి యాదవ్, రాజారావు, సుధాకర్ యాదవ్, మారుతి కుమార్ గౌడ్, గుర్రం నాగభూషణ, బంగి నాగ, సుధాకర్‌నాయుడు, మార్కెట్ మహేష్, స్వప్న, విజయ్ శ్రీరెడ్డి, సంఘ తేజస్విని, కృష్ణవేణి, సరళ, జానకీ, తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి-హిందూపురం

లేపాక్షి మండలం నవోదయ పాఠశాల ఆవరణంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో 9వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల పోటీలకు అనంతపురం ఉమ్మడి జిల్లా హ్యాడ్ బాల్ మహిళా, పురుషుల జట్లను ఎంపిక చేశారు. ప్రిన్సిపల్ నాగరాజు, వివేకానంద, సందీప్, వేదవతి, యాసిన్ మాలిక్, అర్షియ భాను తదితరులు క్రీడాకారుల ఆటను పరిశీలించి జట్లను ఎంపిక చేశారు. మహిళా జట్టులో కుమారి జ్యోతిక, కే లలిత, శ్రీ నిఖిత, దివ్య, నాగ, హర్షిత, జాహ్నవి, వర్షిత, హేమలత, శ్రీ రేణుక రెడ్డి, సాయి కీర్తి, నిఖిత, ఎం చెర్రీ, జాస్మిన్, చందన, ప్రశాంతి లక్ష్మి, సూచితా రెడ్డి, వెన్నెల, లిఖితను ఎంపిక చేశారు. జట్టుకు మేనేజర్ అండ్ కోచ్ గా నవోదయ పాఠశాల పీడీ వేదవతిని నియమించారు. అలాగే పురుషుల జట్టులో సందీప్ కుమార్, బి జీవన్ రెడ్డి, యాగ్ని ఈశ్వర్, ఏ అమన్, జస్వంత్, వంశీ, యశ్వంత్, నరేష్ కుమార్, భరత్, శ్రీ సాయినాథ్, మనోజ్ కుమార్, శివరాజ్, సందీప్ కుమార్‌ను ఎంపిక చేశారు. ఎంపికైన రెండు జట్లు ఈ నెల 23, 24 తేదీల్లో నంద్యాలలోని శ్రీ రామలింగా రెడ్డి డిగ్రీ కళాశాలలో జరిగే 9వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఎంపికైన జిల్లా జట్ల సభ్యులకు జిల్లా హ్యాండ్ బాల్ సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఎం బలరాం రెడ్డి, ముస్తఫా కమల్‌బాసా అభినందించారు.

అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ధర్మవరం విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్ :

అంతర్జాతీయ అబాకస్ పోటీలలో ధర్మవరానికి చెందిన మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ విద్యార్థులు సత్తా చాటారని డైరెక్టర్ శ్రీవాణి, సంస్థ ఫ్రాంచైజీ చంద్రశేఖర్ తెలిపారు. అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపిన ధర్మవరం విద్యార్థులను పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వైద్యులు శీబా నగేష్‌గుప్త, న్యాయవాది క్రిష్ణమోహన్ తదితరులు విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల చెన్నైలో జరిగిన 8వ అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ధర్మవరానికి చెందిన మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్‌కు చెందిన 22 మంది విద్యార్థులు బహుమతులు సాధించారన్నారు. నాగహితశ్రీ, తేజక్రిష్ణ ఛాంపియన్ షిప్ సాధించారన్నారు. కేదార్నాథ్, సంజయ్, జాన్వి, విఖ్యాత్, భవిన్సాయి అత్యున్నత ప్రతిభ కనబరిచి గ్రాడ్యుయేషన్ అర్హత సాధించారన్నారు. హేమన్య, నాగసాయి ఆదర్శ్, అక్షిత్, జశ్వంత్, ఆదిత్య, శ్రీనిత్య, సాయివర్షిణి, హిమజ, భానుప్రకాష్, భవ్య, మోక్షజ్ఞ, గ్రీష్మ, కావ్యలు విన్నర్‌షిప్ సాధించారని తెలిపారు. అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని కోరారు.

తాగునీటి కష్టాలు

నంబులపూలకుంట : మండల కేంద్రంలోని కొత్త రోడ్డు వద్ద ఉన్న కాలనీవాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదని వాపోతున్నారు. మండల కేంద్రంలోనే సమస్య ఇలా ఉంటే ఇక గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని వారు అంటున్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

'వైసీపీదే అధికారం'

కదిరి టౌన్ : రాబోయే ఎన్నికల్లో వైసీపీదే అధికారమని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మక్బుల్ జోస్యం చెప్పారు. ఆదివారం ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు లో నిర్వహించిన ముఖ్యమంత్రి సిద్ధం సభకు కదిరి వైసీపీ శ్రేణులు అధికసంఖ్యలో తరలివెళ్లాయి. వైసీపీ ఇన్‌ఛార్జి మాక్బుల్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బత్తల హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : అనంతపురం జిల్లా రాప్తాడు లో జరిగిన సిద్ధం బహిరంగ సభకు పుట్టపర్తి నియోజకవర్గం నుంచి వైసీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. పుట్టపర్తి శాసనసభ్యులు దిద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సిద్ధం సభకు అధికసంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. సత్యసాయి జిల్లా నుండి 243 ఆర్టీసీ బస్సులు కేటాయించారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కేటాయించిన గ్రామాలకు బస్సులు చేరుకున్నాయి. నిన్న మధ్యాహ్నం నుండి ఆదివారం రాత్రి వరకు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రైవేటు వాహనాలు కూడా అందుబాటులో లేక పోవడంతో ఇబ్బందులు పడ్డారు.

బత్తలపల్లి : సిఎం జగన్మోహన్‌రెడ్డి రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు బత్తలపల్లి మండలం నుంచి భారీగా వైసిపి శ్రేణులు తరలివెళ్లాయి. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు దాదాపు 60 వాహనాల్లో తరలివెళ్లారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

హిందూపురం : ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పరిగి మండలం కోనాపురం గ్రామంలో ఆదివారం శ్రమదానం చేశారు. మురుగు కాలువలను శుభ్రం చేసి, దోమల నివారణ కోసం బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా యూనిట్ 1 ప్రోగ్రాం అధికారి అశ్వర్థ నారాయణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. జియావుల్లాఖాన్ మాట్లాడుతూ పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం

హిందూపురం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి నెల మూర్ఛవ్యాధి గ్రస్తులకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం ఆదివారం పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులోని ఆల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ఇటి. రామ్మూర్తి 156 మంది మూర్ఛ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారికి రెండు నెలలకు సరిపడు మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధిని నియంత్రించ వచ్చని అన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పరిగి : ప్రైవేట్ డ్రైవర్లుగా జీవనం కొనసాగిస్తూ అరకొర కూలితో జీవనోపాధి పొందుతున్న కూలీలను ప్రభుత్వం ఆదుకునే చర్యల్లో భాగంగా వారికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆల్ ఆంధ్ర డ్రైవర్స్, క్లీనర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం పరిగి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కమిటీ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

వైసిపిలో 50 కుటుంబాలు చేరిక

ధర్మవరం టౌన్ : మండల పరిధిలోని గొట్లూరు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసిపిలో చేరాయి. గ్రామానికి చెందిన గొట్లూరు పవన్, అతని మిత్రులు, బంధువులకు చెందిన మొత్తం 50 కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వారికి పార్టీ కండువా కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి, రాజకీయాలకి పార్టీలో చేరిన వారు వైసిపి అభివృద్ధికి పనిచేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చిలమత్తూరు : కొడికొండ చెక్‌పోస్టు జెంగీ డాబా 44 వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.బెంగుళూరు వైపు నుండి వస్తున్న మినీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహదారుడు మొరంపల్లి గ్రామానికి చెందిన రామచంద్రా రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి చిలమత్తూరు కి చెందిన రామారావు తీవ్ర గాయాల పాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదానికి కారణమైన మినీబస్సు డ్రైవర్ పోలీస్ స్టేషన్ కి వచ్చి సరెండర్ అయ్యాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. శనివారం ఈ ప్రాంతం సమీపంలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఆఘటన మరువకముందే అదే ప్రాంతంలో మరో ప్రమాదం చోటు చేసుకుంది.